TG/TEL/25/A3731

నిజాం
దృష్టి తెలుగు న్యూస్

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజాం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-255 | పేజీలు:-4 | ఆదివారం 30-08-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

టిబెట్‌లోనూ జలవిలయం.. నిజాలు దాస్తున్న డ్రాగన్

- ★టిబెట్-నేపాల్ సరిహద్దుల్లో భారీ వరదలతో తీవ్ర నష్టం
- ★విలయానికి సంబంధించిన వీడియోలు చైనాలో తొలగింపు
- ★అంతర్జాతీయంగా వైరల్ అవుతున్న భయానక దృశ్యాలు
- ★వరద నష్టం కాకుండా సహాయక చర్యలకే చైనా మీడియా ప్రాధాన్యం
- ★వందలాది మంది గల్లంతైనా వివరాలు వెల్లడించని అధికారులు

టిబెట్-నేపాల్ సరిహద్దులోని గైరాంగ్ పోర్టు ప్రాంతంలో సంభవించిన జల ప్రళయానికి సంబంధించిన భయానక దృశ్యాలు ప్రపంచవ్యాప్తంగా వైరల్ అవుతుండగా, చైనా ప్రభుత్వం మాత్రం వాటిని తన దేశంలో మీడియాలో కనపడకుండా కఠిన చర్యలు చేపట్టింది. వరద విలయం - మిగతా 2 లో

భారత్‌తో ఘర్షణల నాటి జనరల్‌ను పదవుల నుంచి తొలగించిన చైనా

- ❖గల్వాన్, డోక్లాం ఘర్షణల నాటి జనరల్‌పై చైనా వేటు
- ❖పీఎల్ఏ మాజీ జనరల్ జావో జోంగ్కీని కీలక పదవుల నుంచి తొలగింపు
- ❖ఎలాంటి అధికారిక కారణం వెల్లడించని బీజింగ్ ప్రభుత్వం
- ❖సైన్యంపై పట్టు బిగించేందుకు జిన్‌పింగ్ చేపట్టిన ప్రక్షాళనలో భాగంగానే ఈ చర్యలు

భారత్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ) మాజీ జనరల్ జావో జోంగ్కీపై చైనా ప్రభుత్వం వేటు వేసింది. దేశంలోని అత్యున్నత రాజకీయ - మిగతా 2 లో

మహారాష్ట్ర అంగీకారమే లక్ష్యమన్న మంత్రి ఉత్తమ్

- ●ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి
- ●తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర అనుమతే లక్ష్యం
- ●భారీ లిఫ్టులు లేకుండా గ్రావిటీ ద్వారా 80 టీఎంసీల తరలింపునకు ప్లాన్
- ●సెప్టెంబర్ 1న కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో ఇరు రాష్ట్రాల చర్చలు

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు - మిగతా 2 లో

ఓటర్ల తొలగింపుపై సీఈసీకి సీఎం రేవంత్ రెడ్డి లేఖ

- ▶▶గడువు 4 వారాలు పొడిగించాలని విజ్ఞప్తి
- ▶▶తెలంగాణలో 92.86 లక్షల ఓట్లు పోయాయన్న రేవంత్ రెడ్డి
- ▶▶అర్హులైన వారు ఓటు కోల్పోకుండా సమగ్ర పరిశీలన జరపాలని విన్నపం
- ▶▶ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు భద్రతను కల్పించాలన్న సీఎం

2లో

తెలంగాణలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (౹౹×=) ప్రక్రియపై కేంద్ర ఎన్నికల

22ఏ భూముల సమస్యలపై పోరుబాట

- ➤బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో రాంచందర్ రావు కీలక భేటీ
- ➤మరో రెండు పోరాటాలకు రెడీ అవుతున్న తెలంగాణ బీజేపీ
- ➤సెప్టెంబర్ 5, 6 తేదీల్లో 22ఏ భూముల వ్యవహారంపై దీక్ష
- ➤ఆదిలాబాద్నుంచి అసెంబ్లీ వరకు రైతు యాత్ర

తెలంగాణలో ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తుతూ పార్టీని బలోపేతం చేసుకునే దిశగా - మిగతా 2 లో

వెనెజువెలాతో అమెరికా చారిత్రాత్మక ఆయిల్ డీల్

- ▶▶65 బిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వలు అమెరికా నియంత్రణలోకి
- ▶▶పెరుగుతున్న గ్యాస్ ధరల నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వ కీలక వ్యూహం
- ▶▶ఈ ఒప్పందంతో అమెరికాలో ఇంధన ధరలు తగ్గుతాయన్న అంచనాలు
- ▶▶వెనెజువెలాలో 100 బిలియన్ డాలర్ల ప్రైవేట్ పెట్టుబడులకు అవకాశం

2లో

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ సంచలన ప్రకటన చేశారు. దక్షిణ అమెరికా దేశమైన వెనెజువెలాతో చమురు ఒప్పందం కుదిరిందని, దీని ద్వారా ఆ దేశంలోని 65 బిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వలను అమెరికా

వ్యక్తిగత పర్యటనలో విషాదం

నేపాల్ వరదల్లో ఇన్ఫోసిస్ ఉన్నతాధికారి గల్లంతు

- ★నేపాల్ వరదల్లో ఇన్ఫోసిస్ అనుబంధ సంస్థ హెడ్ లక్ష్ గోపిశెట్టి గల్లంతు
- ★వ్యక్తిగత పర్యటనకు వెళ్లగా ఆయన ఆచూకీ తెలియడం లేదని ఇన్ఫోసిస్ ధ్రువీకరణ
- ★ఆయనను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని, కుటుంబానికి అండగా ఉన్నామని ప్రకటన
- ★గోపిశెట్టికి ఇన్ఫోసిస్‌తో పాటు యాక్సెంచర్, ఐబీఎం వంటి సంస్థల్లో పనిచేసిన సుదీర్ఘ అనుభవం

నేపాల్‌ను అతలాకుతలం చేస్తున్న ఆకస్మిక వరదల్లో ప్రముఖ ఐటీ సంస్థ - మిగతా 2 లో

సహాయం వద్దన్న నేపాల్.. 24 గంటల్లోనే మాట మార్పు!

- ➤నేపాల్ వరదలు.. అంతర్జాతీయ సాయంపై వెనక్కి తగ్గిన ప్రభుత్వం
- ➤దౌత్య ఒత్తిడితో విదేశీ బృందాలకు పరిమిత అనుమతి
- ➤550 దాటిన మృతుల సంఖ్య, 1900 మందికి పైగా గల్లంతు
- ➤సహాయం అందించేందుకు ముందుకొచ్చిన భారత్, ఇతర దేశాలు
- ➤టన్నెల్ రెస్క్యూ, డీఎన్ఏ పరీక్షల్లో విదేశీ నిపుణుల సాయం

నేపాల్‌లో సంభవించిన భీకర వరద విపత్తు విషయంలో ఆ దేశ ప్రభుత్వం - మిగతా 2 లో

ఎవరూ హైదరాబాద్ రావద్దు, రెండు రోజుల్లో నేనే గుంటూరు వస్తా

- ●వైసీపీ నేత అంబటి రాంబాబుకు విజయవంతంగా స్టెంట్ల చికిత్స
- ●రొటీన్ చెకప్‌లో భాగంగా గుండెలో రెండు బ్లాకులు గుర్తింపు
- ●ప్రస్తుతం తన ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడి
- ●హైదరాబాద్ రావద్దని, రెండు రోజుల్లో గుంటూరు వస్తానని కార్యకర్తలకు సూచన
- ●హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో ప్రత్యేక పర్యవేక్షణలో ఉన్న మాజీ మంత్రి

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తన ఆరోగ్య పరిస్థితిపై స్వయంగా స్పందించారు. - మిగతా 2 లో

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

- ❖మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ
- ❖సెప్టెంబర్ 2 వరకు వర్షాల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని వెల్లడి
- ❖లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని, దీని ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రాబోయే కొద్దిరోజుల్లో వర్షాలు - మిగతా 2 లో

ఏకగ్రీవాలపై అధికారంలో ఒక మాట ఇప్పుడొక మాట: చంద్రబాబు

- ▶▶ఏకగ్రీవాలపై గత ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని సీఎం చంద్రబాబు విమర్శ
- ▶▶గిరిజన ప్రాంతాల్లో 'సంజీవని' ప్రాజెక్టు ద్వారా ఇంటింటికీ వైద్య సేవలు అందించే కార్యక్రమానికి శ్రీకారం
- ▶▶రూ.250 కోట్లతో ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన
- ▶▶గత పాలనలో జే బ్రాండ్లు, బలవంతపు మత మార్పిడులతో రాష్ట్రాన్ని నాశనం చేశారని ఆరోపణ
- ▶▶సెప్టెంబర్ 2న అనకాపల్లికి గోదావరి జలాలు, 31న వెలిగొండకు కృష్ణా జలాలు విడుదల

2లో

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాల విషయంలో గత పాలకులు ఇప్పుడు ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలను ప్రోత్సహించి, ఇప్పుడు వాటిని వ్యతిరేకించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అరకు నియోజకవర్గంలోని గన్నెలలో శనివారం జరిగిన 'సంజీవని' ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
ఆదివారం 30-08-2026

ఎవరూ హైదరాబాద్ రావద్దు, రెండు రోజుల్లో నేనే గుంటూరు వస్తా

మొదటిపేజీ తరువాయి - సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగంగా తన గుండెలో రెండు బ్లాకులు గుర్తించారని, వైద్యుల బృందం విజయవంతంగా స్టెంట్లు వేసి చికిత్స పూర్తి చేసిందని ఆయన తెలిపారు. తనను పరామర్శించేందుకు ఎవరూ హైదరాబాద్ రావద్దని, రెండు రోజుల్లో తానే గుంటూరుకు తిరిగి వస్తానని, అక్కడే అందరం కలుసుకుందామని పార్టీ శ్రేణులకు, అభిమానులకు విజ్ఞప్తి చేశారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం అంబటి రాంబాబు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ను మెరుగైన వైద్యం కోసం హుటాహుటిన హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించారు. యాంజియోగ్రామ్ చేసిన అనంతరం, గుండె రక్తనాళాల్లో రెండు బ్లాకులు ఉన్నట్లు నిర్ధారించి, స్టెంట్లు వేయాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియను వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసింది. ప్రస్తుతం అంబటి రాంబాబు ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆయన వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో ఉన్నారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఆందోళన చెందాల్సిన అవసరం ఏమీ లేదని స్పష్టం చేశాయి. ఈ వార్త తెలియడంతో తొలుత వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు ఆందోళనకు గురయ్యారు. అయితే, చికిత్స విజయవంతం కావడం, ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని తెలియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం.. తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

మొదటిపేజీ తరువాయి - మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. బంగాళాఖాతంలో వేగంగా మారుతున్న ఈ వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల వాసులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ వర్షాల తీవ్రత సెప్టెంబర్ 2 వరకు కొనసాగే అవకాశం ఉందని, ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. ఇక తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, రాజధాని హైదరాబాద్‌లో రానున్న 24 గంటల్లో ఆకాశం దట్టంగా మేఘావృతమై అప్పుడప్పుడు వాన చినుకులు పడే అవకాశం ఉందన్నారు. వర్షాలు, ఈదురుగాలుల సమయంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని... చెట్లు, భారీ విద్యుత్ స్తంభాలు, పాత భవనాల కింద నిలబడ వద్దని హెచ్చరించారు. వర్షం కురుస్తున్న సమయాల్లో వాహనదారులు ప్రయాణాల్లో వేగాన్ని తగ్గించి జాగరూకతతో వాహనాలు నడపాలని విపత్తు నిర్వహణ శాఖ కోరింది.

మహారాష్ట్ర అంగీకారమే లక్ష్యమన్న మంత్రి ఉత్తమ్

మొదటిపేజీ తరువాయి - వేస్తోంది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి వద్ద నిర్దేశిత ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వ అంగీకారం పొందడమే తమ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుపై సెప్టెంబర్ 1న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్రాష్ట్ర చర్చల నేపథ్యంలో, ఆయన సచివాలయంలో ఉన్నత స్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీని నిర్మిస్తే, ఎలాంటి భారీ లిఫ్టుల అవసరం లేకుండానే సుమారు 80 టీఎంసీల ప్రాణహిత జలాలను గ్రావిటీ ద్వారా సహజ సిద్ధంగా సుందిళ్ల బ్యారేజీకి తరలించవచ్చని మంత్రి వివరించారు. ఈ సమావేశంలో అధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, చట్టపరమైన అంశాలపై సమగ్రంగా చర్చించారు. బ్యారేజీ నిర్మాణం వల్ల చేకూరే ప్రయోజనాలు, మహారాష్ట్రలో ముంపు ప్రభావం, గ్రావిటీ ద్వారా నీటి తరలింపునకు ఉన్న సాధ్యాసాధ్యాలపై విస్తృతంగా సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం జరిపిన సంప్రదింపుల ఫలితంగానే, కేంద్రం చొరవతో ఇరు రాష్ట్రాల మధ్య అధికారిక చర్చలు ప్రారంభం కావడం ఒక సానుకూల పరిణామమని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

22ఏ భూముల సమస్యలపై పోరుబాట

మొదటిపేజీ తరువాయి - బీజేపీ ముందుకు సాగుతోంది. ఇటీవల విద్యార్థుల ఫీజు బకాయిల చెల్లింపును డిమాండ్ చేస్తూ విజయవంతంగా దీక్ష నిర్వహించిన బీజేపీ నాయకత్వం... తాజాగా రాష్ట్ర ప్రభుత్వ విధివిధానాలకు వ్యతిరేకంగా మరో రెండు ప్రధాన పోరాటాలకు సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో నిషేధిత 22ఏ జాబితాలో చేర్చిన భూముల వ్యవహారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి బాధితులకు అండగా నిలిచేందుకు వచ్చే నెల (సెప్టెంబర్) 5, 6 తేదీల్లో బీజేపీ నేతలు భారీ దీక్ష చేపడుతున్నారు. ఈ దీక్షా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై చర్చించేందుకు ఈరోజు నిర్వహించిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు నేతృత్వంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. మరోవైపు, ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ లోని అసెంబ్లీ వరకు పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ 'రైతు యాత్ర' చేపడుతున్నారు. తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత తీవ్రతరం చేయనున్నట్లు బీజేపీ ప్రకటించింది.

ఓటర్ల తొలగింపుపై సీఈసీకి సీఎం రేవంత్ రెడ్డి లేఖ

మొదటిపేజీ తరువాయి - కమిషనర్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా ఏకంగా 92.86 లక్షల ఓట్ల తొలగింపుకు సంబంధించిన నోటీసులు, పరిశీలనలు వెలువడటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన పౌరులెవరూ ఓటు హక్కు కోల్పోకుండా చూసేందుకు సమగ్ర పరిశీలన అత్యవసరమని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం నిర్ణయించిన గడువులోగా నోటీసులకు స్పందించడం, అభ్యంతరాలు నమోదు చేయడం, అవసరమైన ఆధార పత్రాలను సమర్పించడం సాధారణ పౌరులకు సవాలుగా మారిందని సీఎం పేర్కొన్నారు. ముఖ్యంగా ఉపాధి కోసం తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వలస కూలీలు, రోజువారీ కూలీలు తమ ఓటు హక్కును నిరూపించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో ఓటర్ల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించే సమయాన్ని మరో నాలుగు వారాల పాటు పొడిగించాలని లేఖలో స్పష్టంగా కోరారు. దీంతో పాటు, అత్యధికంగా ఓటర్ల సంఖ్య ఉన్న హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లో పరిశీలన ప్రక్రియ వేగంగా, పారదర్శకంగా సాగేందుకు అదనపు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లను (ఈఆర్ఓలు) తక్షణమే నియమించాలని సూచించారు. గ్రామసభలు, పురపాలక వార్డుల్లో ఓటర్ల జాబితాను బిగ్గరగా చదివి వినిపించాలని, పట్టణ ప్రాంతాల్లో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేసి ఎస్ఐఆర్ ప్రక్రియను వికేంద్రీకరించడం ద్వారా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ం

టిబెట్‌లోనూ జలవిలయం.. నిజాలు దాస్తున్న డ్రాగన్

మొదటిపేజీ తరువాయి - తీవ్రతను, వాస్తవ నష్టాన్ని కప్పిపుచ్చుతూ సమాచారంపై ఉక్కుపాదం మోపుతోంది. ఆగస్టు 26న సంభవించిన ఈ ప్రకృతి విపత్తులో, గైరాంగ్ సరిహద్దు క్రాసింగ్ వద్ద వరద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తూ వాహనాలను, ఇతర వస్తువులను కొట్టుకుపోతున్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ప్రాణభయంతో జనం పరుగులు తీస్తున్న ఈ వీడియోలు అంతర్జాతీయ సోషల్ మీడియా వేదికలపై వేగంగా వ్యాపించాయి. అయితే, చైనాలోని సామాజిక మాధ్యమ ప్లాట్‌ఫామ్‌ల నుంచి ఇలాంటి వీడియోలను అధికారులు తక్షణమే తొలగించారు. అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఆదేశించిన సహాయక చర్యలకు మాత్రమే ప్రభుత్వ మీడియా ప్రాధాన్యతనిస్తోంది తప్ప, ప్రాణ, ఆస్తి నష్టం వివరాలను కానీ, బాధితుల వెతలను కానీ బయటి ప్రపంచానికి తెలియనివ్వడం లేదు. టిబెట్‌లోని గైరాంగ్ కౌంటీలో కొద్దిమంది మరణించారని, విదేశీయులతో సహా వందలాది మంది గల్లంతయ్యారని చైనా అధికారులు ప్రకటించారు. అయితే, ప్రభావితమైన గ్రామాల వివరాలపై కానీ, నష్టం పూర్తి స్థాయిపై కానీ ఇప్పటికీ స్పష్టత ఇవ్వడం లేదు. మరోవైపు, నేపాల్ సరిహద్దు వైపు నుంచి వరద నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు, చిత్రాలు వెలువడుతుండగా, టిబెట్ వైపు మాత్రం సమాచారాన్ని పూర్తిగా నియంత్రించడంపై మానవ హక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. హిమానీనదం (గ్లేసియర్) విచ్ఛిన్నం వల్లే ఈ ఆకస్మిక వరదలు సంభవించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సరిహద్దుకు ఇరువైపులా గాలింపు, సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

భారత్‌తో ఘర్షణల నాటి జనరల్‌ను

పదవుల నుంచి తొలగించిన చైనా

మొదటిపేజీ తరువాయి - సలహా మండలి సభ్యత్వంతో పాటు ఆయన నిర్వహిస్తున్న ఇతర కీలక రాజకీయ పదవుల నుంచి జీవోను తొలగించింది. 2017లో జరిగిన డోక్లాం ప్రతిష్టంభన, 2020 నాటి గల్వాన్ లోయ ఘర్షణల సమయంలో జావో జోంగ్కి పీఎల్ఏ వెస్ట్రన్ థియేటర్ కమాండ్‌కు అధిపతిగా వ్యవహరించారు. చైనీస్ పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ (సీపీపీసీసీ) స్టాండింగ్ కమిటీ ఆగస్టు 26న సమావేశమై జావోను పదవుల నుంచి తొలగించాలని ఓటింగ్ ద్వారా నిర్ణయించింది. జాతీయ కమిటీ సభ్యత్వంతో పాటు, జాతి, మతపరమైన వ్యవహారాల కమిటీ డిప్యూటీ డైరెక్టర్ పదవి నుంచి కూడా ఆయన్ను తప్పించారు. అయితే, ఈ నిర్ణయానికి గల కారణాలను చైనా ప్రభుత్వం అధికారికంగా వెల్లడించలేదు. ఆయనపై ఎటువంటి విచారణకు ఆదేశించినట్లు కూడా ఇప్పటివరకు ప్రకటించకపోవడం గమనార్హం. భారత్‌తో సరిహద్దు వ్యవహారాలను పర్యవేక్షించే వెస్ట్రన్ థియేటర్ కమాండ్‌కు 2016లో తొలి కమాండర్‌గా జావో నియమితులయ్యారు. ఆయన పదవీకాలంలోనే 2017లో 73 రోజుల పాటు డోక్లాం ప్రతిష్టంభన కొనసాగింది. అలాగే 2020లో 20 మంది భారత సైనికులు వీరమరణం పొందిన గల్వాన్ ఘర్షణలు కూడా ఆయన పర్యవేక్షణలోనే జరిగాయి. అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ సైన్యంలో చేపట్టిన భారీ ప్రక్షాళనలో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవలే తీవ్రమైన క్రమశిక్షణా ఉల్లంఘనల ఆరోపణల నేపథ్యంలో జనరల్ జాంగ్ యోక్సియా, లియు జెన్లీలను కూడా సెంట్రల్ మిలిటరీ కమిషన్ నుంచి తొలగించారు. సైన్యంపై తన పట్టును మరింత బిగించుకునే క్రమంలోనే జిన్‌పింగ్ వరుసగా ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.

ఏకగ్రీవాలపై అధికారంలో ఒక మాట...ఇప్పుడొక మాట: చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి - "అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారం కోల్పోయాక మరో మాట మాట్లాడటం వారి నైజానికి నిదర్శనం" అని చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడైనా ఏకగ్రీవం అయితే, సదరు నియోజకవర్గ ఇన్చార్జిదే బాధ్యత... వచ్చే ఎన్నికల్లో వారికి టికెట్ ఉండదు అని జగన్ వైసీపీ నేతలను హెచ్చరించిన నేపథ్యంలో చంద్రబాబు వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా భ్రష్టుపట్టించారని చంద్రబాబు ఆరోపించారు. 'జే బ్రాండ్లు' పేరుతో కల్తీ మద్యం అమ్మి వేల మంది ప్రాణాలతో చెలగాటమాడారని, ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక మద్యం విధానాన్ని ప్రక్షాళన చేశామని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో బలవంతపు మత మార్పిడులకు పాల్పడ్డారని, దేవాలయాల పవిత్రతను దెబ్బతీశారని ఆరోపించారు. ఆర్డీఓ స్థాయి అధికారులను ఎంపిక చేసే గ్రూప్-1 పరీక్ష పత్రాలను ఒక ఎలక్ట్రీషియన్, అటెండర్‌తో దిద్దించి అభ్యర్థుల జీవితాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. ఇక తన పర్యటన ముఖ్య ఉద్దేశమైన 'సంజీవని' ప్రాజెక్టు వివరాలను సీఎం వెల్లడించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రజల చెంతకే వైద్యం అందించే ఈ ప్రాజెక్టు, ఆరోగ్య రంగంలో తదుపరి స్థాయి విప్లవమని అభివర్ణించారు. ప్రతి కుటుంబానికి డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందించి, వారి ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాల మెరుగుదలకు రూ.250 కోట్లతో 'ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంప్లీషన్ మిషన్' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సికిల్‌సెల్, తలసేమియా బాధితులకు నెలకు రూ.10 వేల పెన్షన్ అందిస్తున్నామని, త్వరలో అన్ని మండలాల్లో జన ఔషధి కేంద్రాలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. డ్రోన్ల ద్వారా మారుమూల ప్రాంతాలకు మందులు, వ్యాక్సిన్లు పంపడంతో పాటు రక్త నమూనాలను ల్యాబ్‌లకు తరలించి మెరుగైన వైద్యం అందిస్తామని వివరించారు. గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి తమ ప్రభుత్వం ఐదు సూత్రాల ప్రణాళికతో ముందుకెళుతోందని చంద్రబాబు తెలిపారు. 'అడవి తల్లి బాట' పేరుతో రూ.1,000 కోట్లతో 905 కిలోమీటర్ల రోడ్లు నిర్మిస్తున్నామని, 1.60 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇస్తామని చెప్పారు. అరకు కాఫీ సాగును మరో లక్ష ఎకరాలకు విస్తరించి, హోమ్‌స్టేల ద్వారా పర్యాటకాన్ని ప్రోత్సహించి గిరిజనులకు ఆదాయ మార్గాలు పెంచుతామన్నారు. స్థానిక యువతకు ఉద్యోగాల కోసం తీసుకొచ్చిన జీఓ నంబర్ 3ని గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే సుప్రీంకోర్టు రద్దు చేసిందని, త్వరలోనే అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయం తెస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక ప్రాజెక్టులపైనా చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. ఆగస్టు 31న వెలిగొండ ప్రాజెక్టుకు కృష్ణా జలాలను, సెప్టెంబర్ 2న పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి జలాలను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, గుమ్మిడి సంధ్యారాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సహాయం వద్దన్న నేపాల్.. 24 గంటల్లోనే మాట మార్పు!

మొదటిపేజీ తరువాయి - తన నిర్ణయాన్ని మార్చుకుంది. అంతర్జాతీయ సహాయక బృందాలను అనుమతించబోమని మొదట స్పష్టం చేసినా, దౌత్యపరమైన ఒత్తిడితో వెనక్కి తగ్గింది. భోటేకోశీ నది పరీవాహక ప్రాంతాల్లో గల్లంతైన విదేశీ పౌరుల కోసం గాలింపు చేపట్టేందుకు ప్రత్యేక నైపుణ్యం కలిగిన బృందాలను అనుమతించాలని నిర్ణయించింది. సహాయక చర్యలు చేపట్టే సామర్థ్యం తమకు ఉందని, విదేశీ బృందాలు అవసరం లేదని ప్రకటించిన నేపాల్ ప్రభుత్వం, 24 గంటల్లోనే మాట మార్చడం గమనార్హం. తమ దేశ పౌరులు కూడా పెద్ద సంఖ్యలో గల్లంతైన నేపథ్యంలో వారిని వెతికేందుకు తమ బృందాలను అనుమతించాలని పలు దేశాలు నేపాల్‌పై తీవ్ర ఒత్తిడి తెచ్చాయి. దీంతో ప్రభుత్వం పరిమిత సంఖ్యలో, ప్రత్యేక నైపుణ్యం అవసరమైన రంగాల్లో మాత్రమే విదేశీ సహాయం తీసుకోవాలని నిర్ణయించింది. టన్నెల్ రెస్క్యూ, డీఎన్ఏ పరీక్షలు, ఫోరెన్సిక్ పరిశీలన వంటి అంశాల్లో నిపుణుల సేవలను వినియోగించుకోనున్నట్లు విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ తెలిపారు. "సాధారణ సహాయక చర్యలకు విదేశీ బృందాలు అవసరం లేదు. కానీ సాంకేతిక నైపుణ్యం అవసరమైన కొన్ని ప్రత్యేక రంగాల్లో మాకు సహాయం అవసరం" అని ఆయన 'రాయిటర్స్'కు వివరించారు.

550 దాటిన మృతుల సంఖ్య, 2000 మంది గల్లంతు

భోటేకోశీ, త్రిశూలి నదుల వెంట సంభవించిన ఈ ఆకస్మిక వరదల కారణంగా శుక్రవారం నాటికి 550 మందికి పైగా మరణించారు. మరో 1,924 మంది ఆచూకీ గల్లంతైందని నేపాల్ విపత్తు నిర్వహణ అథారిటీ నివేదిక పేర్కొంది. గల్లంతైన వారిలో 288 మంది భారతీయులు ఉండగా, 100 మంది చైనీయులు, 65 మంది అమెరికన్లు, 53 మంది ఉక్రెయిన్ వాసులు, 35 మంది ఆస్ట్రేలియన్లు, 33 మంది బ్రిటిష్ జాతీయులు ఉన్నారు. ముఖ్యంగా 216 మెగావాట్ల అప్పర్ త్రిశూలి-1 జలవిద్యుత్ ప్రాజెక్టు వద్ద పరిస్థితి అత్యంత క్లిష్టంగా ఉంది. విపత్తు సమయంలో ఇక్కడ 1,350 మంది పనిచేస్తుండగా, వీరిలో 576 మంది కార్మికుల ఆచూకీ ఇప్పటికీ తెలియరాలేదు. టన్నెళ్లలో చిక్కుకున్న వారిని సకాలంలో గుర్తిస్తే ప్రాణాలు కాపాడే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. వరదలు, కొండచరియలు విరిగిపడటంతో రోడ్లు ధ్వంసమై, మొబైల్, టెలిఫోన్ నెట్‌వర్క్‌లు నిలిచిపోయాయి. దీంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది.

రంగంలోకి భారత్, ఇతర దేశాలు

ఈ విపత్కర పరిస్థితుల్లో నేపాల్‌ను ఆదుకునేందుకు భారత్ ముందుకొచ్చింది. టన్నెల్ రెస్క్యూ బృందం, వైద్య బృందం, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని పంపేందుకు సిద్ధంగా ఉన్నామని భారత విదేశాంగ శాఖ తెలిపింది. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, నేపాల్ విదేశాంగ మంత్రితో ఫోన్‌లో మాట్లాడి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 10 టన్నుల మానవతా సాయంతో కూడిన మూడో విమానం ఖాట్మండుకు చేరింది. వైద్యులు, టన్నెల్ రెస్క్యూ నిపుణులతో కూడిన 11 మంది సభ్యుల బృందం కూడా నేపాల్‌కు బయల్దేరింది. ఇదే సమయంలో తమ పౌరులు గల్లంతవడంతో దక్షిణ కొరియా కూడా సహాయక బృందాలను పంపేందుకు ముందుకొచ్చింది. ప్రస్తుతం భారత్, చైనా, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియాల నుంచి నిపుణుల బృందాలకు నేపాల్ ఆమోదం తెలిపింది. ఈ బృందాలు ప్రధానంగా రాసువా, నువాకోట్‌లలోని జలవిద్యుత్ ప్రాజెక్టుల టన్నెళ్లపై దృష్టి సారిస్తాయి. మృతదేహాలను త్వరగా గుర్తించి కుటుంబాలకు అప్పగించేందుకు డీఎన్ఏ పరీక్షల ప్రక్రియలో కూడా ఈ నిపుణులు సహాయపడనున్నారు.

వ్యక్తిగత పర్యటనలో విషాదం

మొదటిపేజీ తరువాయి - ఇన్ఫోసిస్‌కు చెందిన ఉన్నతాధికారి ఒకరు గల్లంతయ్యారు. ఇన్ఫోసిస్ అనుబంధ సంస్థ అయిన 'ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్' హెడ్‌గా పనిచేస్తున్న లక్ష్ గోపిశెట్టి, వ్యక్తిగత పర్యటన నిమిత్తం నేపాల్ వెళ్లారు. నేపాల్-టిబెట్ సరిహద్దుల్లో సంభవించిన వరదల తర్వాత ఆయన ఆచూకీ లభించడం లేదని ఇన్ఫోసిస్ నిన్న ఒక ప్రకటనలో ధ్రువీకరించింది. ఆయనను గుర్తించి, క్షేమంగా కాపాడటమే తమ కర్తవ్యమని కంపెనీ స్పష్టం చేసింది. ఈ ఘటనపై ఇన్ఫోసిస్ స్పందిస్తూ.. "మా సహోద్యోగి లక్ష్ గోపిశెట్టి వ్యక్తిగత పర్యటనపై ఆ ప్రాంతానికి వెళ్లారు. ప్రస్తుతం ఆయనతో సంబంధాలు తెగిపోయాయి. ఆయన ఆచూకీని కనుగొనడానికి, కాంటాక్ట్ ఏర్పాటు చేయడానికి సంబంధిత ఏజెన్సీలతో కలిసి పనిచేస్తున్నాం. ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబంతో నిరంతరం టచ్‌లో ఉంటూ, అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తున్నాము. లక్ష్ క్షేమంగా ఉండాలని, ఈ విషాదం బారిన పడిన వారందరూ సురక్షితంగా బయటపడాలని ప్రార్థిస్తున్నాము" అని పేర్కొంది. అమెరికా, కెనడాలోని ప్రభుత్వ రంగ ప్రాజెక్టులపై ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ ప్రధానంగా దృష్టి సారిస్తుంది. మరోవైపు, ఈ వరదల తీవ్రతపై భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) కీలక వివరాలు వెల్లడించింది. ఈ విపత్తులో సుమారు 320 మంది భారతీయుల ఆచూకీ గల్లంతైందని, మరో 400 మంది చైనా వైపున చిక్కుకుపోయారని తెలిపింది. చైనా వైపు చిక్కుకున్న వారిలో 153 మంది సురక్షితంగా నేపాల్‌కు చేరుకున్నారని పేర్కొంది. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి కాఠ్‌మండుకు చేరుకున్న 21 మంది భారతీయులు నిన్న మధ్యాహ్నం న్యూఢిల్లీకి చేరుకున్నారని ఎంఈఏ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు. ఈ విపత్కర పరిస్థితుల్లో నేపాల్‌కు అన్ని విధాలా సహాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇక, లక్ష్ గోపిశెట్టి నేపథ్యం చూస్తే.. ఆయనకు టెక్నాలజీ రంగంలో అపారమైన అనుభవం ఉంది. ప్రభుత్వ రంగ సంస్థలకు వ్యూహం, టెక్నాలజీ, కార్యకలాపాలు, పరివర్తన వంటి అంశాలపై ఆయన సలహాలు అందిస్తుంటారు. ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ వ్యూహరచన, అమలులో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుత బాధ్యతలకు ముందు, ఆయన ఇన్ఫోసిస్‌లోనే గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్‌గా, బిజినెస్ అప్లికేషన్స్ హెడ్‌గా అమెరికా, యూరప్, ఆసియా అంతటా వ్యాపారాన్ని విస్తరించారు. ఇన్ఫోసిస్‌లో చేరడానికి ముందు ఆయన యాక్సెంచర్‌లో మేనేజింగ్ డైరెక్టర్‌గా, అలాగే బేరింగ్‌పాయింట్, ఐబీఎం, పీడబ్ల్యూసీ, హెచ్‌సీఎల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఉన్నత పదవుల్లో పనిచేశారు. ప్రస్తుతం లక్ష్ గోపిశెట్టితో కాంటాక్ట్ ఏర్పాటు చేసుకునేందుకు ఇన్ఫోసిస్ తీవ్ర ప్రయత్నాలు కొనసాగిస్తుండగా, మరోవైపు వరదల్లో చిక్కుకున్న వందలాది మంది భారతీయులను రక్షించేందుకు భారత ప్రభుత్వం విస్తృత స్థాయిలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తోంది.

వెనెజువెలాతో అమెరికా చారిత్రాత్మక ఆయిల్ డీల్

మొదటిపేజీ తరువాయి - నియంత్రణలోకి తీసుకుంటుందని వెల్లడించారు. "ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద చమురు ఒప్పందం"గా దీనిని ఆయన అభివర్ణించారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ మధ్య జరిగిన చర్చల ఫలితంగా ఈ ఒప్పందం సాకారమైందని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు. అమెరికాలో గ్యాస్ ధరలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో ఈ ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇరాన్‌తో అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం ఆరు నెలలుగా కొనసాగుతుండటంతో, హర్మూజ్ జలసంధి గుండా చమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో అమెరికాలో గ్యాస్ ధరలు ఆకాశాన్నంటాయి. ప్రస్తుతం గ్యాలన్ గ్యాస్ ధర 4.09 డాలర్లుగా ఉండగా, గత ఏడాది ఇదే సమయానికి అది 3.21 డాలర్లుగా ఉండేది. దీంతో అమెరికా తన వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను వాడాల్సి వచ్చింది. ఈ నిల్వలు 2026 ప్రారంభం నుంచి 100 మిలియన్ బ్యారెళ్లకు పైగా తగ్గి, 300 మిలియన్ బ్యారెళ్ల దిగువకు పడిపోయాయి. సుమారు 9 నెలల క్రితం అమెరికా సైన్యం వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అరెస్ట్ చేసి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా ఆరోపణలపై విచారణ కోసం అమెరికాకు తరలించింది. అనంతరం తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన డెల్సీ రోడ్రిగ్జ్, దేశ చమురు రంగాన్ని ప్రైవేటీకరణకు అనుమతిస్తూ చట్టం చేశారు. దశాబ్దాల సోషలిస్ట్ పాలనకు ఇది పూర్తి విరుద్ధం. ఈ మార్పే తాజా ఒప్పందానికి మార్గం సుగమం చేసింది. ఈ ఒప్పందం ద్వారా వెనెజువెలాలోకి 100 బిలియన్ డాలర్ల ప్రైవేట్ పెట్టుబడులు వస్తాయని, అమెరికాలో గ్యాస్ ధరలు తగ్గుతాయని మార్కో రూబియో 'ఎక్స్'లో పేర్కొన్నారు. అయితే, దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన మౌలిక సదుపాయాల కారణంగా వెనెజువెలాలో పెట్టుబడులు పెట్టేందుకు అమెరికన్ ఆయిల్ కంపెనీలు ఎంతవరకు ముందుకొస్తాయనేది వేచి చూడాలి. గతంలో ఎక్సాన్‌మొబిల్ సీఈఓ డారెన్ వుడ్స్, వెనెజువెలాను 'పెట్టుబడులకు అనర్హమైన దేశం'గా అభివర్ణించారు. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు నిల్వలు (సుమారు 303 బిలియన్ బ్యారెళ్లు) ఉన్నప్పటికీ, మౌలిక సదుపాయాల కొరతతో వెనెజువెలా ప్రస్తుతం ప్రపంచ ఉత్పత్తిలో కేవలం 1% మాత్రమే ఉత్పత్తి చేస్తోంది.

నిజం దృష్టి తెలుగు న్యూస్
ఆదివారం 30-08-2026

ఎస్ టిపి దుర్వాసన, భారీ శబ్దాలపై ఎమ్మెల్యే ఆగ్రహం

సమస్యను వెంటనే పరిష్కరించాలని.. అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 29: శనివారం కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బాలాజీ నగర్ లోని రెయిన్బో విస్తా వద్ద ఎస్ .టి .పి ప్లాంట్ ను పరిశీలించారు.. ప్రధానంగా ఆ చుట్టుపక్కల ప్రాంత ప్రజలు ఎస్ .టి .పి ప్లాంట్ నుంచి వస్తున్న దుర్వాసన మరియు భారీ శబ్దాలతో ఇబ్బంది పడుతున్న నేపద్యంలో అధికారులతో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు .. ఫతేనగర్ ,కెపిహెచ్బి ప్రాంతాల్లో నిర్మించిన ప్లాంట్లు వద్ద ఈ సమస్య లేదని ఇక్కడే ఎందుకు ఈ విధంగా వస్తుందో అధికారులు వెంటనే పరిశీలించి పరిష్కారం చూపాలని.. లేనియెడల తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని సూచించారు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సమస్యను పరిష్కరించే దిశగా వెళ్లాలని ఏమైనా ఇబ్బంది ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలని ఆయన తెలిపారు... ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్ ,జనరల్ సెక్రటరీ వెంకటేష్ అధికారులు తదితరులు పాల్గొన్నారు..

ఫతేనగర్ డివిజన్
కాంగ్రెస్ కమిటీ సమావేశం ఘనంగా నిర్వహింపు

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 29: శనివారం ఫతేనగర్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కె. క్రాంతి కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో, కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్ బండి రమేష్ అధ్యక్షతన ఫతేనగర్లో డివిజన్ కాంగ్రెస్ కమిటీ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో ప్రధానంగా ాౡ=-2 కార్యక్రమాల అమలు మరియు డివిజన్లో కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయిలో మరింత బలోపేతం చేయడంపై విస్తృతంగా చర్చించారు. ఫతేనగర్ డివిజన్ పరిధిలోని 36 బూత్లకు ప్రతి రెండు బూత్లకు ఒక ఇన్చార్జ్ను నియమించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, ాౡ=-2 కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ాౡ=-2 కార్యక్రమం పూర్తయిన అనంతరం పార్టీ మరియు ప్రభుత్వ నామినేటెడ్ పదవుల భర్తీ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి (ప్రోటోకాల్ ఱ కోఆర్డినేషన్) సూరజ్ కుమార్ తివారి, టీపీసీసీ ఓబీసీ కోఆర్డినేటర్ కె. రాజు ముదిరాజ్, మాజీ డివిజన్ అధ్యక్షులు కె. రమేష్, ఏఎంసీ డైరెక్టర్ ఎం. రాము, ఐజాజ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సి. కృష్ణ, శాంతి, సీనియర్ నాయకులు ఎల్. నర్సింగ్, హమీద్, అహ్మద్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ చంద్రశేఖర్, ఏ-బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డితో పాటు డివిజన్కు చెందిన ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

విడుదల చేసినవారు: కె. క్రాంతి కుమార్ ముదిరాజ్ అధ్యక్షులు, ఫతేనగర్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ

నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

ఎన్టీఆర్ భవన్ లో చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన టిడిపి నేతలు

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి ఆగస్టు 29: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో దివంగత నేత, మాజీ మంత్రి స్వర్గీయ నందమూరి హరికృష్ణ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు హరికృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు సామ భూపాల్ రెడ్డి హరికృష్ణ చిత్రపటానికి పూలమాలలు అలంకరించి ఆయన సేవలను స్మరించుకుంటూ సంతాప సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అజ్మీర రాజు నాయక్, కట్ట వెంకటేష్ గౌడ్, సంధ్య పోగు రాజశేఖర్, సుభాషిని, స్వాతి, జగదీష్, అన్వర్ మోహన్, రమేష్ లతోపాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరికృష్ణ ప్రజా జీవితంలో చేసిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలుగుదేశం కూకట్పల్లి నియోజకవర్గ నాయకులు వెజిళ్ళ కిషోర్ బాబు పిలుపునిచ్చారు.

వ్యావహారిక భాషో ఉద్యమానికి గిడుగు రామమూర్తి సేవలు చిరస్మరణీయం

తెలుగు భాష దినోత్సవం సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తికి ఘన నివాళులు

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 29: తెలుగు భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆధునిక తెలుగు వ్యవహారిక భాష ఉద్యమ నిర్మాత, సంఘ సంస్కర్త గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పెద్ది హేమలత కిషోర్, వెజెళ్ల కిషోర్ బాబు మాట్లాడుతూ కొద్దిమంది పండితులకే పరిమితమైన చదువు, సాహిత్యాన్ని వ్యవహారిక భాష ద్వారా సామాన్య ప్రజలందరికీ చేరువ చేసిన మహనీయుడు గిడుగు వెంకట రామమూర్తి అని కొనియాడారు. తెలుగు భాషను ప్రజల నిత్య జీవితానికి మరింత చేరువ చేయడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలుగు భాషను పరిరక్షిస్తూ, భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వారు అన్నారు. ఈ సందర్భంగా తెలుగు వారందరికీ తెలుగు భాష దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన పెద్ది హేమలత కిషోర్, కిషోర్ బాబు.

ఆరోగ్యంపై అవగాహనతోనే ఆరోగ్యకరమైన సమాజం

ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: వడ్డేపల్లి రాజేశ్వరరావు

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 29: కూకట్పల్లి నియోజకవర్గం కేపీహెచ్బీ కాలనీలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మాధవ్బాగ్ అడ్వాన్స్డ్ ఆయుర్వేద క్లినిక్ ఱ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంప్ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు, కొలెస్ట్రాల్, రక్తపోటు, థైరాయిడ్, అధిక బరువు వంటి జీవనశైలి సంబంధిత సమస్యలపై ప్రజలు ముందస్తుగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ మెగా మెడికల్ క్యాంప్లో ఉచిత ల్యాబ్ పరీక్షలు, వైద్యుల సంప్రదింపులు, డైట్ సలహాలు, వ్యక్తిగత ఆయుర్వేద మార్గదర్శకత్వం, జీవనశైలి కౌన్సెలింగ్ వంటి సేవలను అందించడం పట్ల నిర్వాహకులను ఆయన అభినందించారు.ప్రజలకు ఆరోగ్య సేవలను మరింత చేరువ చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా నిర్వహించాలని రాజేశ్వరరావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కుమారస్వామి, రఘురాం, మాధవ్ బాగ్ క్లినిక్ వారి సభ్యులు స్థానిక బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ లాటరీ

ఆన్ లైన్ లో ఎంపికైనవారి వివరాలు

అభ్యంతరాలు ఫిర్యాదులకు అవకాశం

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 29: ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ పథకం లాటరీ ప్రక్రియలో భాగంగా శనివారం నాడు 1920 ఇండ్లను కేటాయించారు. ఖైరతాబాద్ కూకట్ పల్లి, బహదూర్ పుర, అంబర్ పేట నియోజకవర్గాల్లో నిర్మించనున్న ఇండ్లకు సంబంధించిన లాటరీని స్థానికంగా ఆయా ప్రాంతాల్లోని వివిధ ఫంక్షన్ హాళ్లలో నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లోనూ అధికారులు, దరఖాస్తుదారుల సమక్షంలో పూర్తి పారదర్శకంగా లాటరీ కొనసాగింది. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని 16 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టు కింద నిర్మిస్తున్న ఇండ్ల కోసం డిమాండ్ సర్వే ద్వారా దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. ప్రాథమిక అర్హతల నిర్ధారణ అనంతరం అర్హులైన వారికి లాటరీ ప్రక్రియ ద్వారా ఇండ్ల కేటాయింపు జరిపారు. ఆగస్టు 28 నుంచి 31వ తేదీ వరకు హౌసింగ్,సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి శుక్రవారం నాడు ప్రారంభించారు. అందులో భాగంగా రెండవ రోజు కూడా లాటరీ ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. ప్రక్రియలో మూడవ రోజు ఆగస్టు 30వ తేదీ ఆదివారం నాడు సనత్ నగర్, శేరిలింగం పల్లి, మలక్ పేట, మేడ్చల్ ఇబ్రహీం పట్నం, నియోజకవర్గాలకు చెందిన లాటరీ నిర్వహిస్తారు. ఆన్ లైన్ లో వివరాలు-అభ్యంతరాల స్వీకరణ ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ కోసం లాటరీలో ఎంపికైన వారి వివరాలు ఆన్ లైన్ లో అందుబాటులో ఉంచుతున్నామని హౌసింగ్ బోర్డ్ వైస్ ఛైర్మన్ వీపీ గౌతమ్ తెలిపారు. లాటరీలో ఎంపికైన వారి వివరాలను అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. దరఖాస్తు స్వీకరణ సమయంలో ఎటువంటి ధ్రువపత్రాలను తీసుకోనందున, దరఖాస్తుదారులు ఇచ్చిన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో నిర్ధారించుకునేందుకు ఈ పరిశీలన చేపడుతున్నామని తెలిపారు. అంతేకాకుండా లాటరీ లో ఎంపికైన వారి విషయంలో ఏమైనా అభ్యంతరాలు ఫిర్యాదులు ఉంటే తెలియజేసే అవకాశాన్ని కూడా కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. అర్హులైన వారికే ఇండ్ల కేటాయింపు జరగాలనే లక్ష్యంతో అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో ఎలాంటి అపోహలు అనుమానాలకు తావు లేదని స్పష్టం చేశారు.

తెలుగు భాషా వికాసానికి సాంకేతికత తోడవ్వాలి

భాషా వ్యాప్తికి తెలుగు వర్సిటీ కృషి అభినందనీయం.

మండలి వెంకట కృష్ణారావు సంస్మృతి పురస్కారానికి టీవీ శ్రీనివాస్ అర్హులు..పురస్కార ప్రదానోత్సవంలో త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనా రెడ్డి

నిజం న్యూస్ హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29: తెలుగు భాషా వికాసానికి సాంకేతికత తోడవ్వాలని, అలాగే స్వచ్ఛమైన తెలుగును కాపాడుకోవడం మనందరి బాధ్యత అని త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనా రెడ్డి సూచించారు. నాంపల్లిలోని ఆడిటోరియంలో సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం నిర్వహించిన మండలి వెంకట కృష్ణారావు సంస్మృతి పురస్కార ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర అసోసియేషన్, పూణె సహాధ్యక్షుడు టి.వి. శ్రీనివాస్ కు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ తెలుగు వారందరికీ తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మండలి వెంకట కృష్ణారావు తనకు అసెంబ్లీలో పరిచయమని, ఎవరి గురించైనా ఎదుటి వాళ్లు చెప్పినప్పుడు చాలా గొప్పగా ఉంటుందని, అటువంటి వ్యక్తి వెంకట కృష్ణారావు అన్నారు.

వర్సిటీ ప్రత్యేక కార్యక్రమాలు అభినందనీయం

తెలుగు యూనివర్సిటీ, తెలుగు భాష విషయంలో వర్సిటీ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. కేవలం భాష మాత్రమే కాకుండా, సంస్కృతి సంప్రదాయాలు, నృత్యాలు, డప్పుల కార్యక్రమాలతో మిగతా వర్సిటీల కన్నా ప్రత్యేకత చాటుతోందని కొనియాడారు. గతంలో ఉన్న గవర్నర్ నార్ల ఈస్ట్ లో ఉన్న కల్చరల్ అసోసియేషన్ల ను తీసుకొచ్చి ఇక్కడ వారి ఎదుగుదలకు కృషి చేశారని గుర్తు చేశారు. మిగతా దేశాలు, రాష్ట్రాలు, ప్రాంతాల్లో కూడా తెలుగు భాష వ్యాప్తికి తెలుగు వర్సిటీ కృషి అభినందనీయమని తెలిపారు. అలాగే టి.వి. శ్రీనివాస్ కు ఈ పురస్కారం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అయితే సాంకేతికత వినియోగంలో తెలుగు యూనివర్సిటీ ఇంకా సాధించాల్సిన అవసరం ఉందని ఇంద్రసేనా రెడ్డి సూచించారు. తరగతి భోదన బట్టీపట్టే పద్ధతిలో కాకుండా, అనుభవ పూర్వకంగా ఉండాలన్నారు. ఆ దిశగా వర్సిటీ ఆలోచించాలని అన్నారు.

ఇంగ్లీష్ పదాలు లేని తెలుగుపై పోటీలు

శ్రీనివాస్ మాటల్లో సిగ్గు, బిడియం వంటి పదాలు ఉన్నాయని, వాస్తవానికి అవస్థేతకు వర్తిస్తాయని చమత్కరించారు. వారంతా స్పష్టంగా తాను తెలుగులో మాట్లాడలేనని అన్నారు. మొత్తంగా ఆయన ప్రసంగంలో కేవలం 3 పదాలు మాత్రమే ఇంగ్లిషువి ఉన్నాయన్నారు. అది నిజంగా గొప్ప విషయమన్నారు. ఆ రకంగా మాట్లాడాలని పోటీలు కూడా పెట్టాలని సూచించారు. వేరే భాషా పదాలు రాకుండా కొన్ని నిమిషాలు మాట్లాడాలని పోటీలు పెట్టడం వల్ల చాలా లాభం ఉంటుందని పేర్కొన్నారు. ఇంత స్వచ్ఛంగా తెలుగు భాష మాట్లాడతారు కాబట్టే శ్రీనివాస్ ఈ పురస్కారానికి అర్హులు అన్నారు. తనకు భాష మీద ప్రత్యేక అభిమానం ఉన్నప్పటికీ, సబ్జెక్ట్ దగ్గరకు వచ్చేసరికి మిగతా భాషలన్నీ వస్తాయని అన్నారు.

తెలుగుకు తగ్గిన ప్రాముఖ్యత

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భాష సంయుక్త రాష్ట్రాలు ఏర్పడితే, అందరూ ఒక్కటిగా ఉంటారని ఆలోచన ఉండేదని, కానీ కొన్ని భాషలను ఆయా రాష్ట్రాలు బలవంతంగా కిల్ చేశాయని తెలిపారు. ఉదాహరణకు ఇక్కడి నుంచి సూరత్, భొంబాయి, పూణా వెళ్లిన వాళ్లు అక్కడ తెలుగు పాఠశాలలు పెట్టుకున్నారని, అలాగే బయట నుంచి వచ్చిన వాళ్లు ఇక్కడ ఆయా భాషల పాఠశాలలు పెట్టుకున్నారని తెలిపారు. శనివారం అక్కడున్న స్కూళ్లలో తప్పనిసరిగా లోకల్ భాష నేర్చుకోవాల్సి ఉంటుందని, అక్కడితో తెలుగుకు ప్రాముఖ్యత తగ్గిందన్నారు. ఒకప్పుడు మా భాష ఉండాలి, మా భాష సంస్కృతి ఉండాలనే ఆలోచన ఉండేదని, ఇప్పుడు అటువంటి ఆలోచన లేదన్నారు.

ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం అవసరం

విద్యార్థులకు ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం, కేస్ స్టడీస్, ఇండస్ట్రీ ఇంటర్న్షిప్, నూతన విద్యాబోధనలు వంటి నూతన పోకడలను తెలుగు వర్సిటీ అనుకరించాలని సూచించారు. విద్య అంటే సాధారణ డిగ్రీలా కాకుండా, అనుభవ పూర్వకంగా ఉండాలనే ఉద్దేశంతో మోదీ ప్రభుత్వం నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకొచ్చిందన్నారు. డిజిటల్ విద్య అవసరం అని గుర్తించాలన్నారు. అయితే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చెబితే అది 100 శాతం కరెక్ట్ అనే ఆలోచన తప్పు అన్నారు. కొన్ని సార్లు సంతకం రాని వారికి కూడా డాక్టరేట్ ఇస్తామని, అది ఆయనకు ఉన్న ప్రత్యేకమైన క్వాలిటీ లభించిన గుర్తింపు అన్నారు. మోదీ ప్రభుత్వం పద్మశ్రీ వంటి బిరుదుల కేటాయింపులో కూడా ప్రత్యేక గుర్తింపు ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. పురస్కార గ్రహీత శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి తరానికి, రాబోయే తరానికి తెలుగు భాషా సంస్కృతులు, వాటి మహోన్నత వైభవాన్ని పరిచయం చేస్తున్న సురవరం తెలుగు విశ్వవిద్యాలయాన్ని అభినందనలు తెలిపారు. తనను పురస్కారానికి ఎంపిక చేసినందుకు అభినందనలు అన్నారు. తనను తెలుగు మాధ్యమంలోనే చదివించిన తల్లిదండ్రులకు, నాన్నమ్మ రుణం తీర్చుకోలేనన్నారు. తమ ఇంట్లో ఎప్పుడూ చక్కటి తెలుగు వాతావరణం ఉండేదని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా వర్సిటీ వీసీ ఆచార్య వెలుదండ నిత్యానంద రావు వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా ఏపీ శాసనసభ్యులు డా. మండలి బుద్ధప్రసాద్, తెలంగాణ ప్రభుత్వం పూర్వ సలహాదారులు డా. కె.వి. రమణాచారి పాల్గొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంత రావు స్వాగతోపన్యాసం చేశారు. డైరెక్టర్ ఆచార్య బి. హెచ్. పద్మప్రియ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మేడ్చల్ రూరల్ జిల్లా లేబర్ సెల్ కన్వీనర్ గా దాసరి మహేష్ యాదవ్



నిజం న్యూస్ ప్రతినిధి, మేడిపల్లి, ఆగస్టు 29: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర లేబర్ సెల్ రాష్ట్ర కన్వీనర్ అంటే శ్రీనివాస్ చేతుల మీదుగా దాసరి మహేష్ యాదవ్ మేడ్చల్ రూరల్ జిల్లా లేబర్ సెల్ కన్వీనర్ గా నియామక పత్రం తీసుకోవడం జరిగింది. నా పై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను ఇచ్చిన జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్ కి ధన్యవాదాలు తెలుపుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి లగిసెట్టి శ్రీనివాస్ రాష్ట్ర సీనియర్ నాయకులు ఏనుగు లక్ష్మయ్య ఎండోమెంట్ కన్వీనర్ ఆదిమూలం కరుణాకర్ డివిజన్ అధ్యక్షులు బొక్క రాజేందర్ రెడ్డి మాజీ కార్పొరేటర్ సీనియర్ నాయకులు వేముల మురళీధర్ సీనియర్ నాయకులు ఎస్ఎం ప్రగతి, భానుకుంట వేణుగోపాల్, గొల్లపూడి శ్రీనివాస్, తూప్రాన్ ఆనంద్ లీలావతి, ఆదిమూలం రమాదేవి, రజకమరి బొడ్డు సంధ్య, కాంత రెడ్డి,, బజ్జూరి శ్రీనివాస్, చందు శివకుమార్, ఆర్ వేణుగోపాల్, బీజేవైఎం రాష్ట్ర సెక్రెటరీ ధర్మపురి అరవింద్, నరేందర్ రెడ్డి, రాజు గౌడ్ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

హామీల అమలుపై కాంగ్రెస్ పార్టీని నిలదీస్తాం.. ఇంటింటికి బాకీ కార్డులు

సెప్టెంబర్ 2 నుంచి డివిజన్ స్థాయి ప్రజా సమావేశాలు.. రెడ్డి సతీష్ అరోరా

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 29: కాంగ్రెస్ పార్టీ 420 హామీలు, బాకపత్రం 6 గ్యారంటీలు పై బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు, డివిజన్ స్థాయి సమావేశాలతో ప్రజాక్షేత్రంలో పోరాటం చేస్తున్నట్లు బిఆర్ఎస్ పార్టీ కూకట్పల్లి నియోజకవర్గం కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా తెలిపారు. వచ్చే సెప్టెంబర్ రెండవ తేదీనుండి జరుగు డివిజన్ స్థాయి ప్రజా సమావేశాలకు కూకట్పల్లి హౌసింగ్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని ఆయన తెలిపారు. ఈ సమావేశాలు మాజీ కార్పొరేటర్ ల ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి సమావేశాలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ డివిజన్ స్థాయి సమావేశాలు సెప్టెంబర్ 2 బోయినపల్లి డివిజన్లో, సెప్టెంబర్ 4 బాలానగర్ డివిజన్లో, సెప్టెంబర్ 5 బేగంపేట డివిజన్లో, సెప్టెంబర్ 6 ఫతేనగర్ డివిజన్ లో, సెప్టెంబర్ 7 మూసాపేట్ డివిజన్లో, సెప్టెంబర్ 8 అల్లాపూర్ డివిజన్లో, సెప్టెంబర్ 9 బాలాజీ నగర్, కె పి హెచ్ బి డివిజన్ల కలిపి, సెప్టెంబర్ 10 కూకట్పల్లి డివిజన్లో జరుగుతాయని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలు బాకపత్రం 6 గ్యారంటీలు పై జరుగు ప్రజా పోరాటానికి డివిజన్ స్థాయిలో వర్దకు కూడా కట్టి భారీ ఎత్తున నిరసనలు తెలుపుతూ కాంగ్రెస్ బాకపత్రం హామీలపై ఇంటింటికి బాకీ కార్డులు చేరే విధంగా చేసి ప్రజలను చైతన్య పరచాలని ఆయన పిలుపునిచ్చారు.

రంగనాయక స్వామి సన్నిధిలో భజనలు

ఘనంగా స్వాగతం పలికిన ఆలయ కమిటీ చైర్మన్ కాలువ రాంరెడ్డి దంపతులు

ఉడిత్యాల శివాంజనేయభజన మండలి భక్తుల కోలాహలం

నిజం న్యూస్ జడ్చర్ల, ఆగస్టు 29: శ్రావణ మాసం ఉత్సవాల్లో భాగంగా బాదేపల్లి రంగనాయక స్వామి దేవస్థానం సన్నిధిలో శనివారం భజనలు చేసినట్లు ఉడిత్యాల శివాంజనేయభజన మండలి భక్తులు, కోట సర్పంచ్ లు శరణయ్య, గంటల మల్లేష్, టి. నారాయణ తదితరులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కాలువ రాంరెడ్డి దంపతులు ఘనంగా స్వాగతం పలికినట్లు వెల్లడించారు. ఆధ్యాత్మిక భావనలకు, దేవుడి చింతనకు ఇలాంటి భజన కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పలువురు పెద్దలు అభిప్రాయపడ్డారు. భజన కార్యక్రమాలు భజన పోటీలలో ఉడిత్యాల శివాంజనేయ భజన మండలి భక్తులు చురుకుగా పాల్గొనడం అభినందనీయమని కొనియాడారు. ఈ భజన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు వి. శరణయ్య, గంటల మల్లేష్ యాదవ్, టి. లక్ష్మీ నారాయణ,, భజన భక్తులు ఆనంద చారి, లింగమయ్య గౌడ్, శివానందమ్, శుభాష్ రెడ్డి, లింగం.గౌడ్, నిరస్ జన్ గౌడ్, రామస్వామి, జంగిలయ్యగౌడ్, చంద్రయ్య యాదవ్, మల్లేష్ యాదవ్, వీరప్ప యాదవ్, బంద యాదయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బండి రమేష్ ఆరోపణలు అబద్దాల పుట్టపై కట్టిన మేడలు

22 ఏ జాబితాలో ప్రైవేటు భూములను చేర్చి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు: బిఆర్ఎస్ నేత రెడ్డి సతీష్ అరోరా



నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 29: ప్యారాచూట్ లీడర్ బండి రమేష్ నీ లాంటి వలస నాయకులు గత 30 ఎండ్లుగా కూకట్ పల్లి నియోజకవర్గం అభివృద్ది ప్రదాత హ్యాట్రిక్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పై కబ్జాలు అంటూ మొరిగి మొరిగి ప్రజా తీర్పులో మూసుకున్నారు అని బి ఆర్ యస్ పార్టీ నియోజకవర్గం కో ఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా ఓ ప్రకటన ద్వారా తెలిపారు. బండి రమేష్ నీకు నీ ప్రభుత్వానికి ప్రభుత్వ భూములేవో ప్రైవేట్ భూములేవో తెలియట్లు... ప్రజలను బెదిరించడమే డబ్బులు గుంజేందుకు 22ఏ లిస్టులో ప్రైవేట్ భూములను కూడా చేర్చి ప్రజలను ఇబ్బందులకు పెడుతున్నారు... హైదర్ నగర్ సర్వే నంబర్ 145,163, హస్మత్ పేట సర్వే నంబర్ 1 అన్ని కూడా పైగా ప్రాపర్టీస్ గా జూ -14 లో ఉన్నాయి... అప్పటి నుంచి నిన్న మొన్నటి వరకు కూడా హై కోర్టు, సుప్రీం కోర్టులు ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా తీర్పులు ఇచ్చాయి... వాటి ప్రకారం ప్రజలు కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకున్నారు.. దీంతో రాజకీయ నాయకుల పాత్ర ఏముందో వివరణ జరపండి. 1958 నుంచి నేటి వరకు ఎవరెవరు రాజకీయ నాయకులు ఇక్కడి భూములల్లో కబ్జాలు చేశారో మీ ప్రభుత్వం ద్వారా విచారణ జరిపి వెలుగులోకి తెండి.. అంతే కానీ అబద్దాల పుట్ట మీద మేడలు కట్టిన నీవు నోటికి వచ్చినట్లు మాట్లాడితే అది

నిజం
దృష్టి తెలుగు న్యూస్
ఆదివారం 30-08-2026

కొమ్ము ఊశయ్య ఇంట్లో రాఖీ పౌర్ణమి సందడి

ప్రేమానురాగాలు.. ఆత్మీయ అనుబంధాలు.. భావోద్వేగాల నడుమ కన్నుల పండుగగా రక్షాబంధన్ వేడుకలు

నిజం న్యూస్ కేసముద్రం, ఆగస్టు 29: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం పట్టణ కేంద్రంలోని చైతన్యనగర్ కాలనీలో గల కీ.శే. కొమ్ము ఊశయ్య గృహంలో రాఖీ పౌర్ణమి వేడుకలు అత్యంత ఆహ్లాదకరంగా, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి. కుటుంబ సభ్యులు, బంధువులు ఒకచోట చేరి ప్రేమ, ఆప్యాయతలు, అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు.

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీలు

ఈ సందర్భంగా జలగం సుశీల, వనగండ్ల జయమ్మ ఇద్దరు సోదరీమణులు తమ సోదరులైన కొమ్ము ప్రసాద్, కొమ్ము సంజీవ, డాక్టర్ కొమ్ము వెంకన్న బాబులకు రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ సోదర--సోదరీమణుల మధ్య ఉన్న ప్రేమానురాగాలను చాటుకున్నారు. అదేవిధంగా జలగం శోభ, పందుల స్వప్న, మిట్టగడుపుల శిరీష, బండ శైలజ తమ సోదరులైన కొమ్ము శ్రావణ్, కొమ్ము చైతన్య, కొమ్ము అభిలాష్, కొమ్ము సుమంత్, కొమ్ము ఉదయ్ కిరణ్ లకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

చిన్నారుల రాఖీలతో ఇంటిల్లిపాదీ సందడి

పందుల ధ్రువ, మిట్టగడుపుల చార్విశ్రీ తన సోదరులైన ఉదయ్ సాహితీ ప్రభాత్, ఉజ్వల్, సుశీల్ ప్రణీత్, ధ్రువకుమార్, ఈషన్ సంగీత్, నిషాన్ సంగీత్ తదితరులకు రాఖీలు కట్టి చిన్నారుల ఆనందాన్ని పంచుకున్నారు. అలాగే కొమ్ము మహీర, కొమ్ము ఐరా మహర్షి తమ సోదరులైన కొమ్ము గుణాన్ష్, కొమ్ము అతర్వ్, కొమ్ము ఆరవ్ లకు రక్షాబంధన్ కట్టి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల సమక్షంలో ఆత్మీయ వాతావరణం

ఈ రాఖీ పౌర్ణమి వేడుకల్లో కొమ్ము పెద్ద కనకమ్మ, కొమ్ము చిన్న కనకమ్మ, కొమ్ము విజయలక్ష్మి, కొమ్ము సారిక, కొమ్ము ఉమ, జలగం వీరస్వామి, మిట్టగడుపుల భరత్, పందుల సతీష్, బండ వెంకన్న, కొమ్ము అమూల్య, కొమ్ము శృతి, కొమ్ము రజిత,కొమ్ము ఉమా సుమంత్, తదితరులు పాల్గొని వేడుకలను మరింత సందడిగా మార్చారు.

రక్షాబంధన్‌పై వై. సత్యనారాయణ రెడ్డి సందేశం

కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా పంచాయతీరాజ్ శాఖ విశ్రాంత ఉద్యోగి వై. సత్యనారాయణ రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు కాంపాటి వీరయ్య తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వై. సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, రక్షాబంధన్ అనేది కేవలం రాఖీ కట్టే పండుగ మాత్రమే కాదని, అన్నాచెల్లెళ్ల మధ్య జీవితాంతం నిలిచే ప్రేమ, నమ్మకం, బాధ్యత, రక్షణకు ప్రతీక అని అన్నారు. కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరి ఇలాంటి పండుగలను జరుపుకోవడం ద్వారా బంధాలు మరింత బలపడతాయని పేర్కొన్నారు. “మనసులు కలిస్తే బంధుత్వానికి హద్దులు ఉండవు. కుటుంబంలో ప్రేమ, పరస్పర గౌరవం, ఆప్యాయతలు ఉంటే అదే సమాజంలో ఐక్యతకు పునాది అవుతుంది. రాఖీ పౌర్ణమి ప్రతి ఒక్కరిలో సోదరభావాన్ని పెంపొందించి, సమాజంలో ప్రేమానురాగాలను విస్తరించాలి” అని ఆయన ఆకాంక్షించారు.

మతసామరస్యానికి ప్రతీకగా సోనీ నజీర్ రాఖీ

ఈ రక్షాబంధన్ వేడుకలకు మరో ప్రత్యేకతగా వెలిశాల నుంచి వచ్చిన సోనీ నజీర్ తన సోదరుడిగా భావించే డాక్టర్ కొమ్ము వెంకన్న బాబుకు రాఖీ కట్టి, మిఠాయి తినిపించారు. మతాలు వేరు అయినప్పటికీ మనసుల్లో ప్రేమ, సోదరభావం ఉంటే మనుషుల మధ్య ఎలాంటి గోడలు ఉండవని చాటి చెప్పిన ఈ ఘట్టం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

రాఖీ అనేది కేవలం ఒక దారం కాదు.. ప్రేమకు ప్రతీక.

మతం కాదు.. మానవత్వమే గొప్పదని చెప్పే బంధం.
కులం కాదు.. సోదరభావమే సమాజాన్ని కలిపే శక్తి.
సోనీ నజీర్, డాక్టర్ కొమ్ము వెంకన్న బాబుకు రాఖీ కట్టిన ఈ ఆత్మీయ సందర్భం కులమతాలకు అతీతంగా మానవ సంబంధాలను గౌరవించాలి, పరస్పర ప్రేమ--సోదరభావాలతో ముందుకు సాగాలి అనే గొప్ప సామాజిక సందేశాన్ని అందించింది.

ప్రేమే బంధం.. మానవత్వమే మార్గం

కుటుంబ సభ్యులందరూ కలిసి ఆనందంగా జరుపుకున్న ఈ రాఖీ పౌర్ణమి వేడుకలు ప్రేమ, ఆప్యాయతలు, అనుబంధాలు, మానవత్వం, మతసామరస్యానికి ప్రతీకగా నిలిచాయి. భావోద్వేగాల నడుమ సాగిన ఈ వేడుకలు కుటుంబ సభ్యులందరికీ మధుర జ్ఞాపకంగా మిగిలాయి.

“రాఖీ బంధం ప్రతి ఇంటా ప్రేమను నింపాలి..
ప్రతి హృదయంలో సోదరభావాన్ని పెంచాలి..
ప్రతి మనిషిలో మానవత్వాన్ని మేల్కొలపాలి..
కులమతాలకు అతీతంగా సమాజమంతా ఐక్యంగా ముందుకు సాగాలి” అనే సందేశాన్ని ఈ రాఖీ పౌర్ణమి వేడుకలు చాటిచెప్పాయి.

కృష్ణారావు స్థాయికి మించి సీఎం రేవంత్ రెడ్డి పై చౌకబారు విమర్శలు

22 ఏ విషయంలో ప్రజల సానుభూతి కోసం నాటకాలు.. కృష్ణారావు హయాంలో చెరువులు, నాళాలు ,కుంటలు కబ్జా: బండి రమేష్

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 29: పదేళ్లపాటు ఎమ్మెల్యేగా పనిచేసిన మాధవరం కృష్ణారావు కూకట్పల్లి నియోజకవర్గానికి చేసిందేమీ లేకపోగా, తన స్థాయికి మించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై చౌకబారు విమర్శలు చేస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఆయన కృష్ణారావును హెచ్చరించారు. శనివారం కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బ్లాక్, డివిజన్ అధ్యక్షులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో బండి రమేష్ మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించడంతో పాటు గత బిఆర్ఎస్ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు.

చెరువులో నాళాలు కబ్జా చేశారని ఆరోపణలు

కృష్ణారావు హయాంలో కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలోని చెరువులు, నాళాలు, కుంటలు పెద్ద ఎత్తున కబ్జాకు గురయ్యాయని బండి రమేష్ ఆరోపించారు. హస్మత్ పెట్ సర్వే నెంబర్ వన్ లో ఉన్న సుమారు 100 ఎకరాలలో కేవలం 10 ఎకరాలు మాత్రమే మిగిల్చారని, అల్లాపూర్ లో నాలుగు ఎకరాల స్థలంలో రెండు ఎకరాలు, గోపాల్ నగర్ లోని సుమారు పది ఎకరాల ఖాళీ స్థలాన్ని కబ్జా చేసి కృష్ణారావు, ఆయన అనుచరులు సొమ్ము చేసుకున్నారని విమర్శించారు. పిజేఆర్ హయాం నుంచి నేటి వరకు కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధి ,బిఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని బండి రమేష్ సవాల్ విసిరారు.

ఆస్తులపై ప్రశ్నలు

మొదటిసారి కౌన్సిలర్ గా పోటీ చేసిన సమయంలో కృష్ణారావు ఆస్తులు ఎంత ఉన్నాయని, ప్రస్తుతం ఆయన ఆస్తుల విలువ ఎంత ఉందని బండి రమేష్ ప్రశ్నించారు. దీనిపై కృష్ణారావు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

22 ఏపై రాజకీయాలు చేస్తున్నారంటూ విమర్శలు

22 ఏ అంశంపై కృష్ణారావు ‘ఉరి, హత్య, ఆత్మహత్య’అంటూ ప్రజల సానుభూతి కోసం నాటకాలు ఆడుతున్నారని బండి రమేష్ విమర్శించారు. కృష్ణారావును చంపాల్సిన అవసరం తమకు లేదని, అలాంటి వ్యాఖ్యలతో ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని అన్నారు.

హౌసింగ్ బోర్డు భూములపై ఎదురుదాడి

హౌసింగ్ బోర్డు స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమ్ముకుంటుందంటూ కృష్ణారావు చేస్తున్న విమర్శలపై బండి రమేష్ తీవ్రంగా స్పందించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేల ఎకరాల ప్రభుత్వ భూములను విచ్చలవిడిగా అమ్ముకున్నారని ఆరోపించిన ఆయన, అప్పట్లో అవి కృష్ణారావుకు కనిపించలేదా అని ప్రశ్నించారు.

సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిని ధ్యేయంగా ముందుకు సాగుతుందని బండి రమేష్ తెలిపారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ ,గ్యాస్, రేషన్ కార్డులు ,పెట్రోల్ బంకులు, బస్సులు, ఇందిరమ్మ ఇల్లు కేటాయింపుల వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తుందని వివరించారు.

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఫ్లైఓవర్లు, అండర్ పాసులు, బ్రిడ్జిలు ,లింక్ రోడ్లు, స్నేక్ వాక్, వంతెనలు నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రజల వైద్య భద్రత కోసం రూ. 10 లక్షల బీమా సౌకర్యాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 70 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిందని, విద్య రంగంలో నూతన విధానాలకు శ్రీకారం చుట్టిందని బండి రమేష్ తెలిపారు. రానున్న ప్రతి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగరవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

పైనాపిలే కదా అని తీసిపారేయకండి.. ప్రయోజనాలు తెలిస్తే షాకవుతారు!

ఫైనాపిల్ మీ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇందులోని విటమిన్ సి ముడుతలను తగ్గిస్తుంది. ఇది చర్మానికి హానిని కూడా నివారిస్తుంది. దీన్ని తీసుకోవడం వల్ల ముఖంలో మెరుపు పెరుగుతుంది. ఫైనాపిల్ శరీరంలో మంటను తగ్గించడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచుతుంది.. ఫైనాపిల్ పండు, జీర్ణక్రియకు సహాయం చేయడం నుండి రోగనిరోధక శక్తిని మెరుగుపరచడం వరకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అలాగే, ఈ పండులో విటమిన్ సి, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. పరిశోధనలన్నీ క్యాన్సర్‌తో పోరాడటానికి, మీ చర్మం మెరుపును పెంచడంలో ఇది ఉపయోగపడుతుందని వెల్లడిస్తున్నాయి. దాని మరిన్ని ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.

పైనాపిల్ ప్రయోజనాలు ఏమిటి?

విటమిన్లు, ఖనిజాలతో సమృద్ధిగా: పైనాపిల్ పండులో విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇవి శరీరం రోజువారీ పనితీరుకు అవసరం. ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ న్యూట్రిషన్ అండ్ ఫుడ్ సైన్సెస్‌లో ప్రచురించబడిన పరిశోధన ప్రకారం, పైనాపిల్స్‌లో ఫైబర్, పొటాషియం, కాల్షియం కూడా తగిన మొత్తంలో ఉంటాయి. అందుకే దీన్ని తీసుకోవడం చాలా మంచిది. పైనాపిల్స్‌లో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి: మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో యాంటీఆక్సిడెంట్లు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. కణాల నష్టంతో పోరాడుతుంది. అలాగే తీవ్రమైన వ్యాధుల నుండి రక్షిస్తుంది. అందుకే మీరు మీ ఆహారాన్ని మరింత ఆరోగ్యవంతంగా మార్చుకోవడానికి ఈ పండును తినవచ్చు. జీర్ణక్రియలో సహాయాలు: పైనాపిల్ పండు మరొక ప్రయోజనం ఏమిటంటే ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. బరువు తగ్గడంలో కూడా సహాయపడుతుంది. ఫైబర్ అధికంగా ఉంటుంది: పైనాపిల్ ఫైబర్ గొప్ప మూలం. ఇది మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది. దీర్ఘకాలిక మలబద్ధకం సమస్యతో బాధపడే వారికి పైనాపిల్ పండు మంచి ఔషధం.

క్యాన్సర్ నివారించవచ్చు: పైనాపిల్ తినడం వల్ల క్యాన్సర్ నివారించవచ్చు. ఎందుకంటే చాలా క్యాన్సర్లు ఆక్సీకరణ ఒత్తిడి వల్ల వస్తాయి. పైనాపిల్‌లో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించే గుణం ఉంది. తద్వారా క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అందుకే క్యాన్సర్ చికిత్సకు కూడా దీన్ని ఉపయోగిస్తారని అధ్యయనం చెబుతోంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: పైనాపిల్ శరీరంలో మంటను తగ్గించడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచుతుంది. నొప్పిని తగ్గించే లక్షణాలు: పైనాపిల్‌లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నందున, ఇది నొప్పిని తగ్గిస్తుంది. ఫుడ్స్‌లో ప్రచురించబడిన ఒక అధ్యయనం ఆర్థరైటిస్ వల్ల కలిగే నొప్పికి చికిత్స చేయడానికి పైనాపిల్ మంచిదని పేర్కొంది. ఇది వెన్నునొప్పిని కూడా తగ్గిస్తుంది. ఇది ఋతు నొప్పిని కూడా తగ్గిస్తుంది. కానీ ఋతు చక్రం మొదటి మూడు రోజులలో తీసుకోవాలి. ఆరోగ్యకరమైన చర్మం మీ సొంతం అవుతుంది: పైనాపిల్ మీ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇందులోని విటమిన్ సి ముడుతలను తగ్గిస్తుంది. ఇది చర్మానికి హానిని కూడా నివారిస్తుంది. దీన్ని తీసుకోవడం వల్ల ముఖంలో మెరుపు పెరుగుతుంది. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణుల సలహాలు, సూచనల మేరకు అందించడం జరిగింది. ఏవైనా సందేహాలు ఉంటే నిపుణులను సంప్రదించండి.

ఉదయాన్నే జీలకర్ర నీరు తాగితే ఎలాంటి లాభాలు ఉంటాయో తెలిస్తే ఆశ్చర్యపోతారు!

జీలకర్ర వాడకం ఆరోగ్య ప్రయోజనాలలో కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రముఖ డైటీషియన్ ఆయుషి యాదవ్ మాట్లాడుతూ.. రోజూ జీలకర్ర నీటిని తాగితే అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయని చెప్పారు. జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడానికి, దాని నీటిని తాగడం చాలా ముఖ్యం.. జీలకర్ర ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది అందరి ఇళ్లలో ప్రతి వంటగదిలో అందుబాటులో ఉంటుంది. జీలకర్ర అనేది ప్రతి వంటల్లో ఉపయోగిస్తుంటారు. దీని వల్ల ఆహారం రుచిగా ఉండడమే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. జీలకర్ర వాడకం ఆరోగ్య ప్రయోజనాలలో కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రముఖ డైటీషియన్ ఆయుషి యాదవ్ మాట్లాడుతూ.. రోజూ జీలకర్ర నీటిని తాగితే అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయని చెప్పారు. జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడానికి, దాని నీటిని తాగడం చాలా ముఖ్యం. జీలకర్ర నీటిని ఖాళీ కడుపుతో తాగితే శరీరంలోని అనేక వ్యాధులు నయమవుతాయి. బలహీనమైన శరీరాన్ని బలోపేతం చేయడంలో ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. దీన్ని రోజూ తాగడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఇందులో అనేక రకాల పోషకాలు ఉంటాయి. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. జీలకర్రలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇది మీ వ్యాధిని నయం చేయడంలో మీకు చాలా సహాయపడుతుంది. మీరు ప్రతిరోజూ ఉదయం తప్పనిసరిగా జీలకర్ర నీటిని తాగాలి. ఇది శరీరంలో వాపులను తగ్గించడానికి కూడా పనిచేస్తుంది. ఇది మాత్రమే కాదు, వివిధ వ్యాధుల నుండి మిమ్మల్ని దూరంగా ఉంచడంలో ఇది చాలా సహాయపడుతుంది. అలాగే శరీరంలోని మురికిని తొలగిస్తుంది. చాలా మందికి శ్వాస సంబంధిత సమస్యలు చాలా ఉన్నాయి. మీరు ఖాళీ కడుపుతో ప్రతిరోజూ జీలకర్ర నీటిని తాగితే, మీరు శ్వాస ఆరోగ్యానికి సంబంధించిన అనేక సమస్యల నుండి బయటపడవచ్చు. శ్వాసకోశంలో ఉపశమనం కలిగించవచ్చు. మీరు దాని నీటిని చాలా వేడిగా తాగాల్సిన అవసరం లేదు. మీరు దానిని గోరువెచ్చగా మాత్రమే తాగాలి. జీలకర్ర నీటిలో యాంటీఆక్సిడెంట్ పదార్థాలు ఉన్నాయి. ఇది మీ శరీరాన్ని నిర్విషీకరణ చేయడంలో మీకు సహాయపడుతుంది. ప్రతిరోజూ ఉదయం నిద్రలేచిన తర్వాత ఈ నీటిని తాగాలి.

కామెర్లు వచ్చినప్పుడు కళ్ళు, గోర్లు ఎందుకు పసుపు రంగులోకి మారుతాయి? కారణం ఇదే



కాలేయం చనిపోయిన కణాలను ఫిల్టర్ చేయలేనప్పుడు, రక్తంలో బిలిరుబిన్ పరిమాణం పెరగడం ప్రారంభమవుతుంది. ఇది శరీరంలోని ఇతర భాగాలకు చేరుకుంటుంది. దీనివల్ల శరీరంలోని అన్ని భాగాలలో పసుపు రంగు వస్తుంది. దీనిని కామెర్లు అంటారు. ఈ వ్యాధిని రక్త పరీక్ష.. కామెర్లు ఒక సాధారణ ఆరోగ్య సమస్య. ఇది సోకినప్పుడు శరీరంలో పసుపు రంగు కనిపించడం ప్రారంభమవుతుంది. దీని ప్రభావం కళ్ళ నుండి గోళ్ళ వరకు కనిపిస్తుంది. వాటిని విస్మరించడం వల్ల కొన్నిసార్లు శరీరంలో ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడుతుంది. కామెర్లు వచ్చిన తర్వాత కళ్ళు, గోళ్ళు ఎందుకు పసుపు రంగులోకి మారుతాయో తెలుసుకుందాం. ఈ లక్షణాలను చూసిన తర్వాత మనం ఎప్పుడు అప్రమత్తంగా ఉండాలి?

అందుకే పసుపు రంగు కనిపిస్తుంది

ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. బిలిరుబిన్ ఎర్ర రక్త కణాలలో కనిపిస్తుంది. శరీరంలో అప్పుడప్పుడు ఎర్ర రక్త కణాలు ఏర్పడి చనిపోతాయి. కాలేయం చనిపోయిన కణాలను ఫిల్టర్ చేయడానికి పనిచేస్తుంది. కాలేయం చనిపోయిన కణాలను ఫిల్టర్ చేయలేనప్పుడు, రక్తంలో బిలిరుబిన్ పరిమాణం పెరగడం ప్రారంభమవుతుంది. ఇది శరీరంలోని ఇతర భాగాలకు చేరుకుంటుంది. దీనివల్ల శరీరంలోని అన్ని భాగాలలో పసుపు రంగు వస్తుంది. దీనిని కామెర్లు అంటారు. ఈ వ్యాధిని రక్త పరీక్ష ద్వారా గుర్తిస్తారు.

ఈ లక్షణాలు కనిపిస్తాయి

కళ్ళు, గోర్లు, మూత్రం పసుపు రంగులోకి మారడం
చర్మం పసుపు రంగులో కనిపిస్తుంది
ఆకలి లేకపోవడం
వికారం
ఏమీ తినాలని అనిపించకపోవడం
కడుపు నొప్పి
అలసిపోయినట్లు అనిపిస్తుంది
బరువు తగ్గడం
ప్రారంభ దశలో వైరల్ జ్వరం సమస్య
చలిగా అనిపిస్తుంది
కడుపు నొప్పి
టారీ బ్లాక్ కలర్ స్టూల్స్

ఇలా మిమ్మల్ని మీరు రక్షించుకోండి: కలుషితమైన ఆహారాన్ని నివారించండ మద్యం సేవించవద్దు మరిగించిన నీరు తాగాలి. నూనె పదార్థాలను నివారించండి కారంగా ఉండే ఆహారానికి దూరంగా ఉండండి భోజనం చేసేటప్పుడు శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించండి.మీకు ఏవైనా లక్షణాలు కనిపిస్తే వైద్యుడిని సంప్రదించండి కామెర్లు కారణంగా వచ్చే సమస్యలు హెపటైటిస్ ఎ, బి, సి, డి, ఇ వంటి వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల ఈ సమస్య రావచ్చు. పారాసెటమాల్ వంటి కొన్ని మందుల అధిక మోతాదు వల్ల ఇది జరగవచ్చు. విషపూరిత పుట్టగొడుగుల వంటి విష పదార్థాల వినియోగం వల్ల ఇది జరగవచ్చు. ఈ పరిస్థితి గిల్బర్ట్ సిండ్రోమ్, డుబిన్-జాన్సన్ సిండ్రోమ్ మొదలైన పుట్టుకతో వచ్చే రుగ్మతల వల్ల

22ఏ నిబంధనపై భగ్గుమన్న అమీన్‌పూర్

జీఎంఆర్ కన్వెన్షన్‌కు పోటెత్తిన బాధితులు..

మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో 22ఏ బాధితులు,కాలనీ వాసులతో భారీ ర్యాలీ

22ఏ నిబంధనను ఎత్తివేసేంత వరకు బీఆర్ఎస్ రాజీలేని పోరాటం: మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.

నిజం న్యూస్ అమీన్‌పూర్, ఆగస్టు 29: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివాదాస్పద 22ఏ నిబంధనతో సాధారణ ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బాధితుల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రజాక్షేత్రంలో అండగా నిలుస్తుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. పటాన్‌చెరు పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధ్యక్షతన 22ఏ సమస్యపై నియోజకవర్గ స్థాయి విస్తృత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాధితులతో కలిసి తరలివచ్చిన తుమ్మల పాండురంగారెడ్డిఈ కార్యక్రమానికి అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 22ఏ నిషేధించబడిన కాలనీలకు చెందిన బాధితులను ఏకం చేస్తూ, అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అమీన్‌పూర్ నుంచి బాధితులతో కలిసి పెద్ద సంఖ్యలో తరలివచ్చి జీఎంఆర్ కన్వెన్షన్‌కు చేరుకున్నారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలపై నిరసన తెలుపుతూ, బాధితుల గళాన్ని బలంగా వినిపిస్తూ సాగిన ఈ ర్యాలీ అందరి దృష్టిని ఆకర్షించింది.

బాధితులకు అండగా ఉంటాం.. నేతల ప్రశంసలు: జీఎంఆర్ కన్వెన్షన్ వేదికగా మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. “అమీన్‌పూర్ పరిధిలోని 22 ఏ నిషేధించబడిన కాలనీల ప్రజలు, 22ఏ బాధితులను సమన్వయం చేసుకుంటూ ఇంతటి భారీ సంఖ్యలో సభకు తీసుకొచ్చి ప్రజా సమస్యను ఎలుగెత్తి చాటిన తుమ్మల పాండురంగారెడ్డి కార్యాచరణ అభినందనీయం” అని ప్రశంసించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ పటాన్చెరువు నియోజకవర్గంలో సుమారు 50 వేల ఎకరాల భూములు 22ఏ నిషేధిత జాబితాలో ఉండటంతో భూ యాజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. 22ఏ కారణంగా భూములను విక్రయించుకోలేకపోవడంతో పాటు బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నారని, వ్యవసాయ భూములకు రైతుబంధు వంటి ప్రభుత్వ ప్రయోజనాలు కూడా అందడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంఘాల ప్రతినిధులు. పెద్ద సంఖ్యలో బాధితులు పాల్గొన్నారు.